క్లుప్తంగా

రేపు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

సత్తెనపల్లి: మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఈ నెల 28న ఉదయం 11 గంటలకు ఎంపీపీ షేక్ ఎలవర్తిపాటి జైబూన్‌బీ అధ్యక్షతన జరుగుతుందని సత్తెనపల్లి ఎంపీడీవో బండి శ్రీనివాసరెడ్డి మంగళవారం తెలిపారు. సమావేశానికి అన్ని శాఖల మండల స్థాయి అధికారులు పూర్తి సమాచారంతో తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. ఎంపీటీసీలు, కో ఆప్షన్ సభ్యులు, సర్పంచ్‌లు, పంచాయతీ సెక్రటరీలు సమావేశానికి హాజరుకావాలని కోరారు.

న్యాయవాదులు విధులు బహిష్కరణ



సత్తెనపల్లి: బాపట్ల న్యాయవాది తలకాయల విజయ్‌కుమార్‌ను బాపట్ల పట్టణ పోలీసులు దుర్భాషలాడటం, అక్రమ నిర్బంధాన్ని నిరసిస్తూ న్యాయవాదులు మంగళవారం విధులు బహిష్కరించారు. సత్తెనపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గంగూరి అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో సత్తెనపల్లి తాలూకా న్యాయస్థానం ప్రాంగణంలో న్యాయదేవత విగ్రహం వద్ద నాలుగు న్యాయస్థానాల్లోని న్యాయవాదులు విధులను బహిష్కరించి బాపట్లలో న్యాయవాది తలకాయల విజయ్‌కుమార్‌ను పట్టణ సీఐ రాంబాబు, ఎస్‌ఐ విజయ్‌కుమార్‌లు దుర్భాషలాడి, అక్రమ నిర్బంధం చేయటాన్ని బార్ అసోసియేషన్ ముక్త కంఠంతో ఖండించి, పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు చిన్నం మణిబాబు, న్యాయవాదులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన సేవలు అందించాలి

డీసీహెచ్‌ఎస్ ప్రసూన



పెదకూరపాడు: ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్యాధికారి (డీసీహెచ్‌ఎస్) ప్రసూన అన్నారు. మంగళవారం పెదకూరపాడు సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, కనీస వసతులు, రికార్డుల నిర్వహణ, పారిశుద్ధ్యం తదితరాలను పరిశీలించారు. నాణ్యత ప్రమాణాల ఆధారంగా జాతీయ నాణ్యత హామీ ప్రమాణాలు (ఎన్‌క్యూఏఎస్) గుర్తింపు కోసం అన్ని సామాజిక ఆరోగ్య కేంద్రాలు ప్రత్యేక ప్రణాళిక రూపొందించుకొని పని చేయాలని సూచించారు. ఆసుపత్రిలో రికార్డులు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

నోటు పుస్తకాలు పంపిణీ



పెదకూరపాడు: మండలంలోని బలుసుపాడు పాఠశాలలో డిలైట్ ఫ్యూచర్ ఆర్గనైజేషన్ ప్రతినిధులు వేమవరపు రమేష్, నినీషా పాఠశాలలో 23 మంది విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు, స్లేట్లు, నోట్‌బుక్స్, పెన్సిల్స్, జామెట్రీ బాక్స్ తదితర వస్తువులను మంగళవారం అందించారు. ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ నల్లమేకల సాంబశివరావు పాల్గొని మాట్లాడుతూ పేద విద్యార్థులకు డిలైట్ ఫ్యూచర్ ఆర్గనైజేషన్ ఎంతో సహకారం అందిస్తుందని తెలియజేశారు. విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలని కోరారు. సహకరించిన పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యు.శ్రీనివాసరావు, ఉపాధ్యాయురాలు కోటేశ్వరిని అభినందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఘంటా ప్రతాప్, నీటిపారుదల సంఘం సెక్రటరీ మద్దినేని చెన్నారావు, 75 తాళ్లూరు క్లస్టర్ సీఆర్‌ఎంటీ శివ తదితరులు పాల్గొన్నారు.

తృణధాన్యాలతో గణనాథుని తయారీ



సత్తెనపల్లి: పట్టణానికి చెందిన యువ ఇంజనీర్ గొల్లపల్లి వీరాంజనేయులు వేరుశనగ పొట్టు, సగ్గుబియ్యం, శనగపప్పు, వ్యవసాయ ఆధారిత ముడి సరుకులతో వినాయకుని ప్రతిమను తయారు చేశాడు. ఇలా చేయడం వల్లన నిమజ్జన సమయంలో నీరు కలుషితం కాకుండా నీటిలో కరిగిపోవడం, జలచరాలకు ఆహారంగా మారతాయనే ఉద్దేశంతో ఎంచుకున్నట్లు తెలిపాడు.

పూజలివే.. నీకు.. ఓ బొజ్జ గణపయ్యా..!

- వాడవాడలా ముస్తాబైన గణనాథుని మండపాలు
- నేటి నుంచి వినాయక నవరాత్రి మహోత్సవాలు



వినాయక ప్రతిమలు, పత్రి, పండ్ల విక్రయాలు



పాతబస్టాండ్‌లో కొలువుదీరుతున్న వినాయకుడు



కట్టమూరివారి వీధిలోని గణేష్ మండపం

సత్తెనపల్లి: తొలి పూజలు అందుకునే గణపతికి తొమ్మిది రోజులపాటు భారీ స్థాయిలో ఉత్సవాలు నిర్వహించటానికి సత్తెనపల్లి రెవెన్యూ డివిజన్ సిద్ధమైంది. డివిజన్ పరిధిలోని సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాల్లోని మండలాల్లో మంగళవారం ఏర్పాట్లు చకచకా సాగాయి. ప్రజలు వినాయక ప్రతిమలు, పూజా సామగ్రి కొనుగోలుతో మార్కెట్లలో సందడి నెలకొంది. విశ్వావసునామ సంవత్సర భాద్రపద శుద్ధ చవితి బుధవారం వాడవాడలా నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ప్రారంభం కానున్నాయి. ఒకరిని మించి ఒకరు భారీ విగ్రహాలు ఏర్పాటు చేశారు. ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపక యంత్రాంగం ఇప్పటికే నిర్వాహకులకు తగిన సూచనలు చేశారు.

మండపాలకు తరలుతున్న గణనాథులు



క్రోసూరు: వినాయకచవితి పండుగ పురస్కరించుకుని బుధవారం నుంచి నవరాత్రి ఉత్సవాల్లో పూజలందుకునేందుకు గణనాథుని విగ్రహాలను భక్తులు మండపాలకు తరలిస్తున్నారు. వినాయకుడుకి ప్రత్యేకంగా కొలిచేందుకు భక్తులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. క్రోసూరులోని నాలుగురోడ్ల సెంటర్ నుంచి తమ గ్రామానికి ఉత్సాహంగా, కోలాహలంగా జై బోలో గణేష్ మహరాజ్‌కీ, జై గణేషా, జై జై గణేషా అంటూ నినాదాలు చేసుకుంటూ ఘనంగా తీసుకెళ్తున్నారు.

భక్తిశ్రద్ధలతో వినాయక ఉత్సవాలు జరుపుకోవాలి

డీఎస్పీ మేదరమెట్ల హనుమంతురావు



మాట్లాడుతున్న డీఎస్పీ హనుమంతురావు, పక్కన సీఐ నాగమల్లేశ్వరరావు, ఎస్‌ఐలు

సత్తెనపల్లి: వినాయక చవితిని పురస్కరించుకొని భక్తిశ్రద్ధలతో వినాయక ఉత్సవాలు జరుపుకోవాలని సత్తెనపల్లి డీఎస్పీ మేదరమెట్ల హనుమంతరావు అన్నారు. పట్టణంలోని తన కార్యాలయంలో మంగళవారం గణేష్ ఉత్సవ మండపాల నిర్వాహకులతో నిర్వహించిన సమావేశంలో, అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు. జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు వినాయక విగ్రహాలు ప్రతిష్టించిన నాటి నుంచి నిమజ్జనం పూర్తయ్యే వరకు పోలీసుల నిబంధనలను వినాయక మండపాల నిర్వాహకులు తప్పనిసరిగా పాటించాలని, లేని పక్షంలో కఠిన చర్యలు తప్పవన్నారు.

+ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా ఎస్పీ సూచనలతో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్న ముగ్గురు రౌడీషీటర్లను ఆరు నెలల పాటు బయటకు రాకుండా రాజమండ్రి సెంట్రల్ జైలుకు పంపటం జరిగిందన్నారు. వారిలో సత్తెనపల్లికి చెందిన భోగ్యం నాగ శ్రీకాంత్, యర్రసాని గోపి, అచ్చంపేట మండలం గ్రంథసిరికి చెందిన బోడపాటి రాజశేఖర్‌లు ఉన్నారన్నారు. మిగిలిన రౌడీ షీటర్లకు కూడా కౌన్సెలింగ్ ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రశాంత వాతావరణంలో వేడుకలు జరుపుకోవాలని కోరారు. సమావేశంలో పట్టణ సీఐ నరహరి నాగమల్లేశ్వరరావు, ఎస్‌ఐలు పవన్‌కుమార్, శ్రీనివాసరావు, ట్రైనీ ఎస్‌ఐ యక్ష తదితరులు ఉన్నారు.

నేడు వాసవి యువశక్తి ఆధ్వర్యంలో మట్టి విగ్రహాల పంపిణీ

సత్తెనపల్లి: వినాయక చవితి సందర్భంగా శ్రీ వాసవి యువశక్తి ఆధ్వర్యంలో మట్టి విగ్రహాలను పట్టణంలోని స్థానిక గాంధీ బొమ్మల సెంటర్లోని వినాయకుడు గుడి పక్కన బుధవారం ఉచితంగా పంపిణీ చేయడం జరుగుతుందని నిర్వాహకుడు కొత్తా రామకృష్ణ మంగళవారం తెలిపారు. గత 12 సంవత్సరాలుగా మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్నామని, ఈ సంవత్సరం వాసవి యువశక్తి ఆధ్వర్యంలో మరింత వైభవంగా పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేసామన్నారు. బుధవారం ఉదయం 6:30 గంటల నుంచి పంపిణీ కార్యక్రమం జరుగుతుందని, ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ హాజరై ప్రారంభిస్తారన్నారు.

మున్సిపాలిటీ వద్దు .. పంచాయతీలే ముద్దు

నందిగామలో మున్సిపాలిటీలో విలీనంపై గ్రామ సభ



ప్రజాభిప్రాయాన్ని తెలుసుకుంటున్న పంచాయతీ సెక్రటరీ కృష్ణప్రసాద్

సత్తెనపల్లి: మున్సిపాలిటీలో విలీనం వద్దని తమకు పంచాయతీనే ముద్దని సత్తెనపల్లి మండలం రామకృష్ణాపురం వాసులు కోరారు. మండలంలోని నందిగామ గ్రామానికి శివారు గ్రామాలైన మురళీనగర్, రామకృష్ణాపురం వాసులతో నందిగామ సచివాలయంలో మున్సిపాలిటీలో విలీనంపై మంగళవారం నందిగామ సర్పంచ్ బలిజేపల్లి రమాదేవి అధ్యక్షతన నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణ గ్రామ సభలో వారు పాల్గొని మాట్లాడారు. మున్సిపాలిటీలో విలీనం చేస్తే తమపై అధిక పన్నుల భారాలు పడతాయని, గ్రామ పంచాయతీనే కావాలన్నారు. కాగా మురళీనగర్ వాసులు అటు పంచాయతీ సేవలు, ఇటు మున్సిపాలిటీ సేవలు పొందడానికి పలు ఆటంకాలు ఏర్పడుతున్న తరుణంలో మున్సిపాలిటీకి దగ్గరగా ఉన్నందున మున్సిపాలిటీలో విలీనానికి కొంత మొగ్గు చూపారు. కాగా దీనిపై ఈ నెల 28న మరోసారి మురళీనగర్, రామకృష్ణాపురంలో వేర్వేరుగా గ్రామ సభలు నిర్వహిస్తామని, ప్రజల కోరిక మేరకు ఆ సమాచారాన్ని ఉన్నతాధికారులకు పంపుతామని పంచాయతీ కార్యదర్శులు సీహెచ్ కృష్ణప్రసాద్, కుంభా వెంకటేశ్వర్లు తెలిపారు. సమావేశంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆళ్ళ సాంబయ్య, మురళీనగర్, రామకృష్ణాపురం వాసులు పాల్గొన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే లైసెన్సులు రద్దు



మన గ్రోమోర్ ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

అచ్చంపేట: రైతులకు కావలసిన ఎరువులను ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయించినా, కృత్రిమ కొరత సృష్టించినా లైసెన్సులు రద్దు చేస్తామని మండల ప్రత్యేక అధికారి మస్తానమ్మ ఎరువుల డీలర్లను హెచ్చరించారు. జిల్లా కలెక్టరు ఆదేశాల మేరకు తహసీల్దార్ కె.శ్రీనివాసరావు, సీఐ కె.శ్రీనివాసరావు, ఏవో పి.వెంకటేశ్వర్లుతో కూడిన ప్రత్యేక బృందం స్థానిక ఎరువుల దుకాణాలను మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా మన గ్రోమోర్‌లో ఉన్న స్టాకు వివరాలను అడిగి తెలుసుకున్నారు. స్టాకు వివరాలతో కూడిన బోర్డులను ధరల పట్టికలను ఉంచాలన్నారు. రైతులు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలన్నారు. డిమాండ్‌కు సరిపడా ఎరువులు ఉన్నాయో లేవో సరిచూసుకోవాలని సూచించారు. ఎలాంటి అవకతవకలకు పాల్పడవద్దని, ప్రతి విక్రయం పారదర్శకంగా ఉండాలని డీలర్లను హెచ్చరించారు. వారి వెంట వ్యవసాయ, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

ఎరువులు కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు



దమ్మాలపాడు సొసైటీలో రికార్డులను పరిశీలిస్తున్న మండల స్థాయి కమిటీ సభ్యులు



ఎరువుల షాపులో తనిఖీ చేస్తున్న అధికారులు



గణపవరంలోని దుకాణంలో రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి తదితరులు

దమ్మాలపాడు(ముప్పాళ్ళ): మండలంలోని ఎరువుల దుకాణదారులు కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మండల స్థాయి కమిటీ సభ్యులు తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని దమ్మాలపాడు, చాగంటివారిపాలెం గ్రామాల్లోని ఆంధ్రబ్యాంక్ ఫార్మర్ సొసైటీ లిమిటెడ్, ఎరువుల దుకాణాలను మంగళవారం కమిటీ సభ్యులు తనిఖీ చేశారు. దుకాణాల్లో జరుగుతున్న పంపిణీ కార్యక్రమాన్ని, ఎరువుల నిల్వలను పరిశీలించారు. ప్రైవేట్ డీలర్లు, దుకాణదారులు ఎమ్మార్పీ కంటే అధిక ధరకు అమ్మితే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవటం, లైసెన్స్ క్యాన్సిల్ చేయటం జరుగుతుందన్నారు. రైతులకు బ్యాగ్ పైన ఉన్న గరిష్ఠ ధరకు మాత్రమే ఎరువులు విక్రయించాలన్నారు. దుకాణంలో స్టాక్ బోర్డు కనపడే విధంగా ఉంచాలని, సక్రమంగా అమ్మకాలు జరుపుకోవాలన్నారు. రైతులు ఎరువులు లేవని అధైర్యపడాల్సిన అవసరం లేదన్నారు. మండల పరిధిలో అన్ని రైతు సేవా కేంద్రాలలోను రెండు రోజుల్లో ఎరువుల నిల్వలు అందుబాటులో ఉంచటం జరుగుతుందన్నారు. మండల ప్రత్యేకాధికారి, జిల్లా పశుసంవర్ధ శాఖ అధికారి రామారావు, తహసీల్దార్ కె.నగేష్, ఏవో ఎస్.శ్రీధర్, ఎస్సై వి.సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

సత్తెనపల్లి: రైతులకు ఎరువులు నిర్ణీత ధరలకే విక్రయించాలని, అధిక ధరలకు విక్రయిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని సత్తెనపల్లి ఏవో బి.సుబ్బారెడ్డి అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండల పరిధిలోని మండల ప్రత్యేక అధికారి, వ్యవసాయ అధికారి, రెవెన్యూ అధికారి, అర్బన్ ఎస్‌ఐలు ఎరువుల దుకాణాల్లో మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఎరువులను ఈ-పాస్ ద్వారానే అమ్మకాలు జరపాలని, ఈ-పాస్ మెషిన్‌లోని స్టాకు, భౌతిక నిల్వలకు సరిపోలి ఉండాలన్నారు. వ్యత్యాసం ఉన్నచో వారికి ఎరువుల కేటాయింపు జరగదన్నారు. ఎరువుల గోడౌన్‌లలోని స్టాకు ఈ-పాస్ మెషిన్‌లోని నిల్వలను సరిపోల్చి చూశారు. తహసీల్దార్ కేఎస్ చక్రవర్తి మాట్లాడుతూ డీలర్లు ఎరువులను రైతులకు అందుబాటులో ఉంచాలన్నారు. రైతులు బస్తాల మీద ముద్రించిన ధరకే కొనుగోలు చేయాలని సూచించారు. ఎరువులను కృత్రిమ కొరత సృష్టించరాదన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి వి.శ్రీనివాసరెడ్డి, టౌన్ ఎస్‌ఐ జె.శ్రీనివాసరావు, సిబ్బంది ఉన్నారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ

క్రోసూరు: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు క్రోసూరులోని ఎరువుల దుకాణాలను మండల స్పెషల్ ఆఫీసర్ కె.శ్రీనివాసరావు, తహసీల్దార్ వి.వి.నాగరాజు, ఎంపీడీఓ రవికుమార్, ఎస్సై రవిబాబుతో కలిసి ఏవో వేణుగోపాల్ మంగళవారం తనిఖీ చేశారు. క్రోసూరులోని పవన్ ఎంటర్‌ప్రైజెస్, మన గ్రోమోర్ సెంటర్, సాయిలక్ష్మి ఫెర్టిలైజర్స్ షాపులను తనిఖీ చేశారు. ఆయా షాపుల్లో నిల్వ ఉన్న ఎరువులకు, స్టాక్ రిజిస్టర్ నిల్వ, ఈ-పాస్ మెషిన్‌లోని నిల్వలతో సరిచూశారు. ధరల పట్టిక, లైసెన్స్ ప్రదర్శన చేసినదీ లేనిది తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఎరువులు అధిక ధరలకు విక్రయించరాదని, ప్రతి బస్తాను ఈ-పాస్ ద్వారా బిల్లు చేయాలని తెలిపారు. ఏవో మాట్లాడుతూ రైతులు అధీకృత డీలర్ వద్దనే ఎరువులు కొనుగోలు చేయాలని, తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలన్నారు. ఎవరైనా అధిక ధరలకు అమ్మిన, అనధికారిక నిల్వలు ఉంచినా, స్థానిక వ్యవసాయ అధికారికి తెలిపితే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

ఎరువుల కొరత సృష్టిస్తే కఠిన చర్యలు

రాజుపాలెం: ఎరువుల కృత్రిమ కొరత సృష్టించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మండల ప్రత్యేక అధికారి నారదాముని డీలర్లను హెచ్చరించారు. మండలంలోని గణపవరం, ఉప్పలపాడు గ్రామాలలోని ప్రైవేటు ఎరువుల దుకాణాలు, సొసైటీలోని ఎరువుల నిల్వలను మండల ప్రత్యేక అధికారి నారదముని, తహసీల్దార్ ఎస్.సరోజ, ఎస్‌ఐ వేణుగోపాల్, ఏవో వెంకటనర్సయ్య మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేక అధికారి మాట్లాడుతూ ఎరువుల నిల్వలను స్టాకు బోర్డులో ఎప్పటికప్పుడు తెలియజేయాలని అన్నారు. ఎమ్మార్పీ కంటే ఎక్కువ రేట్లకు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్టాకు రిజిస్టర్లను పరిశీలించారు. ఎరువులు నిల్వ ఉన్నాయని రైతులు అధైర్యపడవద్దని తెలిపారు. కార్యక్రమంలో షాపు నిర్వాహకులు పాల్గొన్నారు.

సేవకు ప్రతిరూపం మదర్ థెరిస్సా



రోగులకు పండ్లు, బ్రెడ్‌లు పంపిణీ చేస్తున్న డీసీహెచ్‌ఎస్ డాక్టర్ ప్రసూన, జ్యోతి ఫౌండేషన్ సభ్యులు

డీసీహెచ్‌ఎస్ డాక్టర్ ప్రసూన



థెరిస్సా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

సత్తెనపల్లి: సేవకు ప్రతిరూపం మదర్ థెరిస్సా అని డీసీహెచ్‌ఎస్ డాక్టర్ ఎం.ప్రసూన అన్నారు. మదర్ థెరిస్సా జయంతి సందర్భంగా జ్యోతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని మాస్టిన్‌పేట ఫౌండేషన్ కార్యాలయంలో థెరిస్సా చిత్రపటానికి, గుంటూరు రోడ్‌లోని మదర్ థెరిస్సా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏరియా వైద్యశాలలోని రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ మదర్ థెరిస్సా జీవనం సర్వమానవాళికి మార్గదర్శకమన్నారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడారు. కార్యక్రమంలో జ్యోతి ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు ఓలేటి కుమారి, న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావు, బక్క సుబ్బారావు, సీహెచ్ వీరబ్రహ్మం, జ్యోతి ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విశ్వమాత మదర్ థెరిస్సా

పెదకూరపాడు : విశ్వమాత మదర్ థెరిస్సా అని పెదకూరపాడు జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.వి.రమణ అన్నారు. పెదకూరపాడు జిల్లా పరిషత్ పాఠశాలలో మంగళవారం థెరిస్సా జయంతిని ఘనంగా నిర్వహించారు. థెరిస్సా చిత్రపటానికి విద్యార్థులు, ఉపాధ్యాయులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం హెచ్ఎం రమణ మాట్లాడుతూ మానవసేవే మాధవ సేవగా కొన్ని కోట్ల మంది పేద ప్రజలకు సేవలు అందించిన మహోన్నత వ్యక్తి థెరిస్సా అని కొనియాడారు. థెరిస్సాను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

థెరిస్సాకు నివాళులర్పించిన డాక్టర్ గజ్జల



థెరిస్సా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డాక్టర్ గజ్జల, నాయకులు

నరసరావుపేట: పట్టణంలోని సత్తెనపల్లి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవ రెడ్డి భారతరత్న మదర్ థెరిస్సా చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. థెరిస్సా జయంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ముప్పాళ్ళ మండల ఎంపీపీ మారూరి పద్మావతి రామలింగారెడ్డి (చిన్న), జిల్లా బూత్ కమిటీ అధ్యక్షుడు ఇందూరి నర్సింహారెడ్డి, మాజీ మండల కన్వీనర్ రెండెద్దుల వెంకటేశ్వరరెడ్డి, గుండ్లపల్లి సర్పంచ్ కొత్తపల్లి ప్రసాద్, రుసుం చంద్రయ్య పాల్గొన్నారు.

మట్టి గణపతి విగ్రహాల పంపిణీ



సత్తెనపల్లి: వినాయక చవితిని పురస్కరించుకొని ప్రతి ఒక్కరూ మట్టి గణపతిని పూజించి పర్యావరణాన్ని కాపాడుకుందామని సత్తెనపల్లి డీఎస్పీ మేదరమెట్ల హనుమంతురావు పిలుపునిచ్చారు. బెల్లంకొండ చారిటబుల్ ట్రస్ట్, వాసవి మణికంఠ క్లబ్ సత్తెనపల్లి వారి ఆధ్వర్యంలో పట్టణంలోని ఐదు లాంతర్ల సెంటర్లో మంగళవారం 1000 మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. డీఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ మట్టితో తయారు చేసిన వినాయక విగ్రహాలను అందరు పూజించాలని, పర్యావరణాన్ని పరిరక్షించే బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమానికి ఆర్థిక సహకారం అందించిన దివ్వెల గోపి, టి.పద్మావతి, జి.పద్మజ, పిల్లుట్ల కోటేశ్వరరావులను అభినందించారు. మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ నాగేశ్వరరావు, న్యాయవాది శ్రీనివాసరావు, బెల్లంకొండ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు నాగసాయిప్రసాద్, వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానం చైర్మన్ బచ్చు కొండలు, వాసవి మణికంఠ క్లబ్ అధ్యక్షుడు కాశీ వెంకట సుబ్బారావు, సెక్రటరీ శ్రీనివాసరావు, కాశీ విశ్వేశ్వరరావు, జోన్ చైర్మన్ నాగేశ్వరరావు, శివ కోటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

గణపతి నవరాత్రి ఉత్సవాలకు సర్వం సిద్ధం



మట్టి విగ్రహాలను విక్రయిస్తున్న విక్రయదారులు

అచ్చంపేట: విఘ్నాలకు అధిపతి విఘ్నేశ్వరుడి చవితి వేడుకలను నిర్వహించేందుకు గ్రామ గ్రామాన, వీధివీధిన పందిళ్లు వేశారు. గణనాథుని జన్మదినోత్సవం చవితి నుంచి 9 రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేశారు. చవితి రోజు ఇంటింటా వినాయకుని పండుగ జరుపుకునేందుకు కావలసిన వినాయకుని మట్టి ప్రతిమ, పత్రి తదితర పూజా సామగ్రి విక్రయాలు జోరందుకున్నాయి. గణపతి ఉత్సవాలు నిర్వహించే వారు అచ్చంపేట పోలీసు వారి అనుమతితో, నిబంధనల మేరకు మండపాలు ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ గతపతి ఉత్సవాలను భక్తితో జరుపుకోవాలి తప్ప రాజకీయ రంగులు పులిమితే ఉపేక్షించేది లేదన్నారు. మండపాల రాజకీయ పార్టీల జెండాలు, పాటలు డీజే సౌండ్స్‌తో అవరోధాలు కలిగించడాన్ని పూర్తిగా నిషేధించినట్లు చెప్పారు. నిబంధనలను అతిక్రమించిన వారిపై కేసులు నమోదు చేయనున్నట్లు చెప్పారు. గణపతి విగ్రహాలను కృష్ణానదిలో నిర్దేశించిన ప్రాంతాలలోనే నిమజ్జనం చేసుకోవాలన్నారు.

రైతులు పంట వివరాలు నమోదు చేసుకోండి

ఏవో వేణుగోపాల్



క్రోసూరు: మండలంలోని పీసపాడు, ఉయ్యందన గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏవో వేణుగోపాల్ పాల్గొని మాట్లాడుతూ ఖరీఫ్ 2025-26 సీజన్‌లో రైతులు సాగు చేస్తున్న పంటల వివరాలను ఈ-పంట యాప్ ద్వారా రైతు సేవా కేంద్ర సిబ్బంది నమోదు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పథకాలు, రాయితీలు పొందొచ్చన్నారు. కౌలు రైతులు పంట సాగుదారు హక్కు పత్రం ద్వారా పంట నమోదు చేసుకోవాలన్నారు. సాగులో ఉన్న పత్తి పంటను పరిశీలించి యాజమాన్య పద్ధతులను వివరించారు. రైతు సేవా కేంద్ర సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

స్నేహహస్తాలు ఆధ్వర్యంలో నోట్‌పుస్తకాలు పంపిణీ



నకరికల్లు: విద్యారంగానికి, పర్యావరణ పరిరక్షణకు స్నేహహస్తాలు ఫౌండేషన్ చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని ఎంఈవో యేసుబాబు అభినందించారు. స్నేహహస్తాలు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నకరికల్లులోని ఎంపీపీ మెయిన్ పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం నోట్‌పుస్తకాలు పంపిణీ చేసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు సేవా కార్యక్రమాల ద్వారా విద్యాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. విద్యార్థులు ఒక్కో మొక్కను దత్తత తీసుకొని సంరక్షించాలన్నారు. ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి శివరాం, రిటైర్డ్ ఉపాధ్యాయుడు ఇన్నయ్య, డిప్యూటీ తహసీల్దార్ కొండారెడ్డి, డాక్టర్ బండ్ల రాము, హెచ్ఎం మేదరమెట్ల స్వామి, శ్రీనివాసరావు, కామేశ్వరరావు, మండల కో ఆర్డినేటర్ బత్తిన మల్లికార్జునరావు, సిబ్బంది పాల్గొన్నారు.